క్లుప్తంగా

గాయకుడు పీటీ అవధానికి సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం అనురాగదేవత చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం వరకట్నం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాహితీవేత్త, రచయిత, గాయకుడు పి.టి. అవధానిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేసన కోటేశ్వరరావు, హేమంత్ కుమార్, జి. బాలసుందరం, వెంకటప్రతాప్, ఘంటసాల లక్ష్మణరావు, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబశివరావు, జొన్నకూటి నీలాంబరం, టి. వెంకట సుబ్బారావు, ఎ. శివరామకృష్ణ, ఎం. శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ సోమవారం ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ తెనాలి, దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు కొంగల రవికుమార్, అందె బాల చంద్రమౌళి, నాయకులు వంకదార సుబ్బారావు, డీఎస్ సుదర్శన్ శాస్త్రి పాల్గొన్నారు.

శ్మశానవాటికకు మార్చురీ బాక్స్ బహూకరణ



తెనాలి: మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు అయితానగర్‌లోని మహాప్రస్థానానికి సోమవారం మార్చురీ బాక్స్‌ను బహూకరించారు. పట్టణ జయప్రకాష్‌నగర్‌లోని మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ సమాధి స్థలి వద్ద మహాప్రస్థానం కమిటీకి బాక్సును అందజేశారు. ఈ వితరణకు కమిటీ తరఫున జెట్టి అంకినీడు ధన్యవాదాలు తెలియజేశారు.

వాలీబాల్ పోటీల్లో నందివెలుగు జట్టుకు ప్రథమ స్థానం



తెనాలి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) వాలీబాల్ లీగ్ గుంటూరు జిల్లా స్థాయి ఒకరోజు పోటీల్లో నందివెలుగు జట్టు ప్రథమ స్థానం సాధించగా, తెనాలి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టుకు తృతీయ స్థానం దక్కినట్టు తెనాలి స్టేడియం ఇన్‌ఛార్జి, వాలీబాల్ కోచ్ కె.కోటేశ్వరరావు సోమవారం తెలియజేశారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన పోటీల్లో విజేతలకు అదేరోజు రాత్రి వైస్ చాన్సలర్ డాక్టర్ పి.నాగభూషణం బహుమతుల్ని అందజేశారు.

వివేకానంద పురస్కారానికి రామచంద్రరావు ఎంపిక



భట్టిప్రోలు: చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు గోలి రామచంద్రరావు 'వివేకానంద పురస్కారం-2023'కి ఎంపికయ్యారు. వివేకానంద విద్యా, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేయడం జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు, ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు సోమవారం తెలిపారు. రామచంద్రరావు తెలుగు, సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. 2019లో ఉత్తమ కవిగా జాతీయ పురస్కారం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పత్రికల్లో అనేక వ్యాసాలు రచిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. విభిన్న విభాగాల్లో ఆయన ప్రతిభ చూపడంతో వివేకానంద పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందని హేమశంకరరావు పేర్కొన్నారు.

రైతు నాయకుడికి జనం జేజేలు



నివాళి కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరైన జనం



సమాధి వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

- ఘనంగా మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ వర్ధంతి
- రాజకీయపార్టీల కతీతంగా నివాళి అర్పించిన ప్రముఖులు

తెనాలి: మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెనాలిలో ఆయన స్థాపించిన ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఆవరణ ఉదయం తొమ్మిది గంటలకే కిటకిటలాడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, న్యాయవాదులు, వైద్యులు, వ్యాపారులు అక్కడికి చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్ప దంపతుల్ని పలకరించి, సత్యనారాయణ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. రైస్‌మిల్లర్‌గా, కౌన్సిలరుగా, మున్సిపల్ చైర్మన్‌గా, ఏఎస్ఎన్ కాలేజీ వ్యవస్థాపకునిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన సేవల్ని స్మరించుకున్నారు. ఆయన కన్నుమూసి మూడు దశాబ్దాలు గడచిపోయినా ఇప్పటికీ ఆ జ్ఞాపకాలు పదిలంగానే ఉన్నాయని చాటారు. అక్కడ్నుంచి ఏఎస్ఎన్ విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బందితో కలసి జయప్రకాష్‌నగర్‌లోని ఆయన సమాధిస్థలి వరకు పాదయాత్రగా తరలివెళ్లారు. అక్కడ సమాధిపై పుష్పగుచ్ఛాల నుంచి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మల్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, తెనాలి, కొల్లిపర ఎంపీపీలు చెన్నుబోయిన శ్రీనివాసరావు, భీమవరపు పద్మావతి, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, రాళ్లబండి సుష్మ, తెనాలి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, జిల్లా మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మీకుమారి, బిషప్ సుధీర్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, శ్రీవాసవీ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, శశి గ్రూప్ అధినేత వుప్పల వరదరాజులు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సాధు ప్రతాప్, జనసేన నాయకుడు తోటకూర వెంకట రమణారావు, టీడీపీ నాయకులు మంగమూరి యుగంధర్, జంపాల వెంకట కృష్ణారావు, న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, కేవీఎం విల్సన్, చింకా సురేష్, మద్ది మల్లికార్జునరావు, ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, డాక్టర్ జె.కోటినాగయ్య, వైసీపీ నేతలు అడుసుమల్లి శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అంగలకుదురులో...

తెనాలి టౌన్: రూరల్ మండలం అంగలకుదురులో మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ వర్ధంతిని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నిర్వహించారు. గ్రామంలోని చెరువు సెంటర్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, జూనియర్ అన్నాబత్తుని సత్యనారాయణ, పార్టీ నాయకులు జాస్తి శ్రీనివాసరావు, బండి హైమారావు, ముచ్చా ఆనంద్, కడియాల సురేష్, లావు పున్నారావు, కొండమూడి విజయ్, కిరణ్ చంద్, అరవ బాజీ, తోట శ్రీకాంత్, గాలి శివన్నారాయణ, షేక్ బాదుల్లా పాల్గొన్నారు.

12న తెనాలిలో జాబ్ మేళా



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, నేతలు

తెనాలి: తెనాలి ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏటా నిర్వహిస్తున్న జాబ్ మేళాను 2023 సంవత్సరానికి ఈనెల 12న నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ విభాగం సహకారంతో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మొత్తం 18 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే జాబ్‌మేళాలో కనీసం 1015 మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. పదో తరగతి నుంచి ఇంజినీరింగ్, పీజీ చదివిన నిరుద్యోగ యువత ఆరోజు ఉదయం 9 గంటల్నుంచి జరిగే జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని సూచించారు. జాబ్‌మేళా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు 6302096189, 9666545975 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అక్కిదాసు కిరణ్, బూరెల దుర్గాప్రసాద్, దేసు శ్రీనివాసరావు, మన్నవ ప్రభాకర్, తాడిబోయిన రమేష్, తోట రఘురామ్, కఠారి హరీష్, కనపర్తి అనిల్, ప్రసాదం బాలగురవమ్మ, కాళిదాసు వెంకటేశ్వరరావు, భవానీశంకర్ పాల్గొన్నారు.

రచయిత ఆళ్లకు తెలుగుతేజం అవార్డు



తెనాలి: తెలంగాణాకు చెందిన పుడమి సాహితీ వేదిక నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సాహితీ రంగంలో గత నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్న తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవా సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నల్గొండ జిల్లా చిట్యాలలోని శ్రీరాజరాజేశ్వరి ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి జరిగిన వార్షికోత్సవ సంబరాల్లో ఈ గౌరవాన్ని అందజేశారు. సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు.

తెనాలి చిన్నారుల చిరుమువ్వల సవ్వడి

కళా నిలయం జాతీయ నృత్య పోటీల్లో ప్రతిభ



నృత్య గురువు డాక్టర్ బాలకు 'నాట్య విజ్ఞాన్' పురస్కారం

తెనాలి: చిలకలూరిపేటలోని కళా నిలయం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరిగిన 38వ జాతీయస్థాయి నృత్య పోటీల్లో తెనాలి చిన్నారులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. పట్టణానికి చెందిన కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు, నృత్య గురువు డాక్టర్ చల్లా బాలాత్రిపురసుందరి శిష్య బృందం 15 మంది ఈ పోటీల్లో కూచిపూడి, జానపద, శాస్త్రీయ బృంద నాట్యం విభాగాల్లో పోటీ పడ్డారు. వీరిలో భువనేశ్వరి, శ్రీవల్లిక, బాలమహతి, నివేదికత, మౌనికల శాస్త్రీయ బృంద నాట్యం ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో రాజహంస అవార్డును బహూకరించారు. వీరిలో బాలమహతి, శ్రీవల్లికలు స్థానిక మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు. అక్కాచెల్లెళ్లు చలమలశెట్టి మహతి, రిషిత గణపతి స్తుతి అనే కూచిపూడి అంశాన్ని ప్రదర్శించి 'నాట్యమయూరి'ని స్వీకరించారు. చిన్నారుల్ని నాట్యంలో తీర్చిదిద్దిన నృత్య గురువు డాక్టర్ బాలాత్రిపురసుందరిని 'నాట్య విజ్ఞాన్' పురస్కారంతో సత్కరించారు. ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నృత్య గురువు బాలాజీరావు వ్యవహరించారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి



షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): స్త్రీ విద్య, అభ్యున్నతి కోసం, మహిళల హక్కుల కోసం, తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త ఫాతిమా కృషి చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. దుగ్గిరాలలోని జెండాచెట్టు సెంటర్ వద్ద ఫాతిమా జయంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆమె ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుభాని మాట్లాడుతూ బహుజన పిల్లలకు, ముస్లిం ఆడపిల్లలకు చదువుకోమని ఇంటింటికి తిరిగి అడిగేవారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2022లో ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన తెలుగు పుస్తకంలో ఆధునిక తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమాకు స్థానం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో షేక్ రషీద్, షేక్ జాని, షేక్ గఫూర్, పఠాన్ ఖాదర్, షేక్ ఖుద్దూస్ పఠాన్ మస్తాన్, బుసులుపాటి యల్లేశ్వరరావు, కాకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలి అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 7గంటలకు 27వ వార్డు చెంచుపేటలోని పద్మావతి కల్యాణ మండపం నుంచి ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

తహసీల్దార్ మల్లేశ్వరి



గ్రామ సభలో ప్రసంగిస్తున్న దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): గ్రామాల్లో, పట్టణాల్లో భూ సమస్యలను పరిష్కరించి, వివాదాలు లేకుండా చేయడానికి రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పేరుకలపూడిలో వైఎస్సార్ జగనన్న భూహక్కు- భూరక్ష పథకంపై న గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో నిర్వహించిన సర్వే రికార్డులనే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఆ రికార్డులను మార్చి ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరించేందుకు అధునాతన యంత్రాలతో రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. సమావేశంలో పేరుకలపూడి గ్రామ సర్పంచి గంపల గంగాధర్ పాల్గొన్నారు.

నేషనల్ వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాలలోని కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతవారంలో తమిళనాడులోని నాగర్ కోయిల్‌లో నిర్వహించిన నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తమ విద్యార్థి గండికోట కృష్ణబాబు సిల్వర్ మెడల్ సాధించాడని, ఫిబ్రవరి నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగే ఖేల్ ఇండియా పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిల్వర్ మెడల్ సాధించిన గండికోట కృష్ణబాబును డాక్టర్ కె.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు, కంభంపాటి క్రాంతి కుమార్ అభినందించారు.

వైభవంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు



శ్రీ విద్యా పీఠంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తెనాలి టౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామీజీ ఆధ్వర్యంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 24వ రోజు గోదాదేవికి తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా అత్యంత వైభవంగా మహిళలు దీపోత్సవం జరిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు ధనుర్మాస విశిష్టతను వివరించారు. బాలస్వామీజీ ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సాలీగ్రామ మఠం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య దంపతులు, ఉప్పల నాగేశ్వరరావు దంపతులు, యక్కల మాల్యాద్రి, గోపు రామకృష్ణ, చుండూరు లోకనాథం దంపతులు పాల్గొన్నారు. మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదాదేవిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కృష్ణా నదిలో ఆక్రమణలను నిలువరించండి



స్పందనలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కొల్లూరు: కృష్ణా నదిలోని బుసక మేటలో చెట్లు నరికి, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని నిలువరించి, నదీ తీరాన్ని పరిరక్షించాలని రైతులు కొల్లూరు తహసీల్దార్‌కు విన్నవించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందనలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పెదలంక అరవింద వారధి వెంబడి ఉన్న బుసక మేటలో కొందరు చెట్లు నరికి, భూమి చదును చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన బుసక మేటల్లో స్థానిక రైతులు మొక్కలు పెంచి, నదీ తీర ప్రాంతంలోని భూములు కోతకు గురికాకుండా కాపాడుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. నదిలో కొద్దిపాటి నీరు విడుదల చేసినా బుసక మేటలు ముంపునకు గురై.. తీరం వెంబడి వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నట్లు తెలిపారు. నది మధ్యలో ఉన్న పది లంక గ్రామాలకూ ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బుసక మేటల్లో చిట్టడవిలా పెరిగిన చెట్లు భారీ వరదల సమయంలో తీరం కోతకు గురికాకుండా రక్షణ గోడల్లా నిలుస్తున్నాయని వెల్లడించారు. చెట్లు తొలగింపుతో వరదల సమయంలో ప్రవాహ వేగానికి బుసక మేటలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. వాల్టా చట్టాన్ని అతిక్రమించి చేపడుతున్న చర్యలను నిలువరించాలని రైతులు తహసీల్దారును కోరారు. ఆక్రమణలను అడ్డుకోవాలని ఇప్పటికే పోలీసులకు ఆదేశాలు జారీచేశామని, ఈ భూముల్లో ఎటువంటి కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని రైతులకు తహసీల్దారు హామీ ఇచ్చారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

బాపట్ల టౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ జీవీఎల్ఎన్ మూర్తి హెచ్చరించారు. బాపట్ల పట్టణంలో సోమవారం విద్యుత్ శాఖాధికారులు 48 బృందాలుగా ఏర్పడి 3442 మీటర్లను ఆకస్మికగా తనిఖీ చేశారు. దాడుల్లో 81 మంది అదనపు లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ. 6.33లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. గృహోపకరణాలకు కనెక్షన్ తీసుకొని వాణిజ్య సముదాయాలకు వినియోగిస్తున్న నలుగురికి రూ.15 వేలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ జి.ఆంజనేయులు, డీఈ ఆంజనేయులు, ఏఈ పెరుగు శ్రీనివాసరావు, విజిలెన్స్ డీఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.

'స్పందన'తో సమస్యలు పరిష్కారం

ఆర్డీవో జగన్నాథం పార్థసారథి

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మూడు అర్జీలు అందాయని ఆయన తెలిపారు. కుమారుడు పోషణ చూడటం లేదని, కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామానికి చెందిన ఓ వృద్ధరాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పెనుమూడి గ్రామానికి చెందిన 60 ఎస్టీ కుటుంబాలకు నివేసన స్థలాలు మంజూరు చేయాలని, న్యాయవాద భృతి ఇప్పించాలని అర్జీలు అందినట్లు చెప్పారు. ఈ సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు.

'స్పందన'కు రెండు అర్జీలు

చెరుకుపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి సోమవారం రెండు అర్జీలు అందాయని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. కనగాల గ్రామానికి చెందిన దూపం బసవ మల్లయ్య తన స్థలం అన్యాక్రాంతమైందని, సర్వే నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. నడింపల్లి గ్రామానికి చెందిన ఇందిర అనే దివ్యాంగురాలు గత నెల నుంచి పింఛన్ రావడంలేదని మరో అర్జీ సమర్పించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తహసీల్దారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ రాముని పట్టాభిషేకం



స్వామివారి పాదుకలకు అభిషేకం చేస్తున్న సప్త రుషులు, పాల్గొన్న దంపతులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలోని శ్రీ రామ నామక్షేత్రంలో సోమవారం శ్రీ రాముని పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. పూజల్ని కూరపాటి సుధాకర శాస్త్రి శాస్త్రయుక్తంగా జరిపించారు. సప్త రుషులు, స్వామి పాదుకలకు అభిషేకం చేశారు. ఉదయం శ్రీ పట్టాభిరామునికి నగరోత్సవం గావించారు. బాలాత్రిపుర సుందరి మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ సహస్ర నామ స్తోత్రం, స్తుతులు, గేయాలు ఆలపించారు. మచిలీపట్నానికి చెందిన మడమల రాంబాబు భాగవతార్ హరికథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం శ్రీ వెంకటేశ్వర భజన భక్త సమాజం ఆర్గనైజర్ ఆత్మూరి మురళి భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయ స్వామికి కుందేటి శ్రీనివాసరావు, నాగజ్యోతి దంపతులు ఆకు పూజ చేశారు. రాత్రి అమలాపురానికి చెందిన బాబ్జీ బుర్రకథ ఎంతగానో ఆకట్టుకుంది. పూజల్లో డొక్కు నాగాంజనేయులు, శివ చంటి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కాగిత దుర్గా ప్రసాద రావు, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం తగదు

సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

రేపల్లె రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్. గంగయ్య పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థల్ని కార్పొరేట్ సంస్థలకు లీజుల పేరుతో తాకట్టు పెడుతున్నట్లు మండిపడ్డారు. అంబాని, అదాని వంటి వ్యాపారవేత్తల ఆస్తులు రోజు రోజుకీ పెరుగుతున్నా, కార్మికుల, కూలీల వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. బీజేపీ విధానాలతో పేద ప్రజలు రోజు గడవక ఇబ్బంది పడుతున్నారని, ప్రైవేటీకరణతో ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు అమ్ముకునే బీజేపీ, దేశాభివృద్ధి వైపు వెళ్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ తన విధానాలను మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, సీపీఎం నేతలు డి.శ్రీనివాసరావు, ఆగస్టిన్, యు.రామకృష్ణ, ఎన్. శివశంకర్, నవీన్, సూర్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

ధూళిపాళ్ళ దత్తాత్రేయులు, అడ్వకేట్
డోర్.నెం.26-31-100/ఎ. 5వ లైన్, ఏటీ అగ్రహారం, గుంటూరు. సెల్: 7702922895